మిగిలింది రెండు రోజులే..



నరసన్నపేట: ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

- మద్యం దుకాణాలకు 880 దరఖాస్తుల రాక
- టెక్కలి, కోటబొమ్మాళిలో అత్యల్పం

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: జిల్లాలో నూతనంగా ఏర్పాటు కానున్న ప్రైవేటు మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు అవసరమైన దరఖాస్తు ప్రక్రియ ముగియడానికి మరో రెండు రోజులే గడువు ఉంది. ఈ నెల రెండో తేదీన ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ తొమ్మిదో తేదీ సాయంత్రం ముగియనుంది. సోమవారం సాయంత్రానికి జిల్లావ్యాప్తంగా నిర్దేశించిన 158 దుకాణాలకు 880 దరఖాస్తులు వచ్చాయి. శ్రీకాకుళంలో 32 దుకాణాలకు 266, టెక్కలిలో 11 చోట్లకు 19, కోటబొమ్మాళిలో 15 షాపులకు 31, రణస్థలంలో 15కు 176 దరఖాస్తులు దాఖలయ్యాయి. శ్రీకాకుళంలో ఒక్కో దుకాణానికి సగటున ఎనిమిది మంది, రణస్థలంలో సుమారు 18 మంది పోటీ పడుతున్నారు. మంగళ, బుధవారాల్లో రెట్టింపు దరఖాస్తులు దాఖలయ్యే అవకాశం ఉందని ఆబ్కారీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోవచ్చు: మంత్రి

మద్యం దుకాణాలకు వ్యాపారులు, ఆశావాహులు ఎక్కడి నుంచైనా ఎవరైనా ఎలాంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన 'ఈనాడు'తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మద్యం విధానంపై రాజీపడే పడే ప్రసక్తే లేదన్నారు. వ్యాపారులు, ఆశావాహులు ఎవరైనా స్వేచ్ఛగా మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ ప్రక్రియకు ఎవరు భంగం కలిగించినా ఉపేక్షించేదిలేదన్నారు. ఇబ్బంది లెదురైతే ఎస్పీ లేదా తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని మంత్రి స్పష్టం చేశారు.

ఊరూరా శరణు ఘోష



జిల్లాకు దసరా శోభ వచ్చింది.. ఏ ఊరు చూసినా ఆధ్యాత్మికత సంతరించుకుంది.. దుర్గమ్మ నామ జపమే మారుమోగుతోంది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు, పీఠాలు, మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రోజుకో రూపాన అమ్మ దర్శనమిస్తున్నారు.. శరణు, శరణు తల్లి అంటూ భక్తులు ప్రణమిల్లుతున్నారు.. మహిళలు సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణాలు చేస్తున్నారు.. శ్రీకాకుళం నగరంలోని మొంటేటి వీధిలో చండీ అవతారంలో లలితాదేవిని చిత్రంలో చూడొచ్చు..

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

విశాఖ-శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: దసరా, పైడితల్లి సిరిమానోత్సవాల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 10 నుంచి 16 వరకు విశాఖ-శ్రీకాకుళంరోడ్-విశాఖ(08529-08530) ప్రత్యేక మెమో రైలు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ రైలు ఉదయం 10 గంటలకు విశాఖలో బయలుదేరి సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకాకుళం రోడ్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.30 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖ చేరుకోనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి ఈ రైళ్ల సేవల్ని వినియోగించుకోవాలని కోరారు.

రైతే రాజు 6లో

ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఒకరు.. చేసిన పనికి బిల్లు ఇవ్వలేదని మరొకరు..సాగునీరు అందించి పంటలు కాపాడాలంటూ రైతులు.. ఇలా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఆశ్రయించారు. జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వినతులు అధికారులు తప్పనిసరిగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. 129 అర్జీలు అందాయని, అవసరమైనవిగా ఉన్న వినతులపై సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో అప్పారావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే కలెక్టరేట్

ఆలకించండి.. ఆదుకోండి!

'మీకోసం'లో అర్జీదారుల వేడుకోలు

4 ఏళ్లు.. 40 వినతులు



2021 నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. సుమారు 40 సార్లు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదు. తెదేపా హయాంలో ఉపాధి పథకం కింద ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో రూ.3.95 లక్షలతో అభివృద్ధి పనులు చేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసినా బిల్లులు చెల్లించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాం. దీనికి కారకులైన సర్పంచి చెక్‌పవర్ రద్దు చేయాలని 2022లో ఆదేశించినా పట్టించుకోలేదు. నాకు న్యాయం జరిగేలా చూడాలి.

– కొత్తకోట అమ్మినాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు

కంటికి గాయమైనా కనికరం లేదు..



ఈనెల ఒకటో తేదీన రణస్థలం మండలం పైడి భీమవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు కొట్టిన దెబ్బకు మా కుమారుడు చెన్నా అరుణ్‌కుమార్ కంటికి గాయమైంది. పాఠశాల ఉపాధ్యాయులు చికిత్సకు సాయం అందించకపోగా హేళనగా మాట్లాడుతున్నారు. ఈ విషయంపై సాక్ష్యం చెప్పకుండా ఉండాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– బాధిత విద్యార్థి అరుణ్‌కుమార్ తల్లిదండ్రులు హారిక, నాగరాజు

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి!



గార మండలం శ్రీకూర్మంలో 1.42 సెంట్ల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించడానికి యత్నిస్తున్నారు. వేరే వ్యక్తులు వచ్చి పొక్లెయిన్‌తో చదును చేసి కొబ్బరి మొక్కలు నాటారు. భూమి మాదని అంటున్నారు. అడ్డుకున్నందుకు మాపై దాడి చేశారు.

– వెలమ వీధి వాసులు, శ్రీకూర్మం

- ఇచ్ఛాపురం మండలం తోటూరు గ్రామంలో రెండు సెంట్లకు పైగా ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. – లక్ష్మి, భాజపా మహిళా మోర్చా అధ్యక్షురాలు

కలల గూడు చెదిరింది..

గోడు మిగిలింది..!


గూడులేని పట్టణ ప్రజలు సొంతింటి కల నెరవేరుతుందని ఆశతో టిడ్కో గృహాల కోసం కూడబెట్టిన సొమ్ము, మరికొందరు అప్పు చేసి డీడీలు తీసి కట్టారు.. గత ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసిందే తప్ప ఇల్లు ఇవ్వలేదు.. ఐదేళ్ల పాటు వేచి చూసినా ఫలితం దక్కలేదు.. పోని కట్టిన మొత్తమైనా తిరిగి ఇవ్వాలని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. శ్రీకాకుళం నగరంతో పాటు ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆముదాలవలస పురపాలక సంఘాల పరిధిలో టిడ్కో గృహాలు రాని వారంతా కూటమి ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.



బొడ్డపాడు వద్ద టిడ్కో గృహ సముదాయం.. పక్కన పునాది దశలో నిలిచిన నిర్మాణం

- పురపాలికల్లో తేలని టిడ్కో గృహాల పంచాయితీ
- డిపాజిట్ మొత్తం తిరిగి ఇవ్వాలని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

న్యూస్‌టుడే, పలాస, శ్రీకాకుళం అర్బన్, ఇచ్ఛాపురం, ఆముదాలవలస పట్టణం



★ శ్రీకాకుళానికి చెందిన శ్రీనివాసరావు 430 చదరపు అడుగుల టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ రూ.లక్ష చెల్లించారు. గూడు రాకపోగా డిపాజిట్ సొమ్ము కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

★ 2018లో తెదేపా ప్రభుత్వం నగరపాలక, పురపాలక సంఘాల పరిధిలో టిడ్కో గృహ సముదాయాలు నిర్మించాలని సంకల్పించింది. 2019 నాటికి పనులు పూర్తికాకపోవడం.. అదే ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి వచ్చింది. అప్పటివరకు నిర్మాణంలో ఉన్న వాటినే పూర్తిచేసేలా ఆ పార్టీ నేతలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కొందరికే ఇళ్లు వచ్చాయి. మిగిలిన వారు చెల్లించిన సొమ్ము తిరిగి వాపసు ఇవ్వాలని కోరుతున్నారు. వైకాపా హయాంలో ఈ పథకం కింద రూ.50 వేలు చెల్లించిన వారికి రూ.25 వేలు, రూ.లక్ష చెల్లించిన వారికి రూ.50 వేలు తిరిగి ఇస్తామని అధికారులు ప్రకటించారు. లబ్ధిదారులు చెల్లించిన సొమ్ము ఇస్తారా? లేక టిడ్కో గృహాలకు చెల్లించిన మొత్తంలో కలిపేసుకుంటారా అనే విషయంపై స్పష్టత లేదు.

మున్సిపాలిటీ	మొత్తం ఇళ్లు	లబ్ధిదారులు	కానివారు	ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం
శ్రీకాకుళం	3,811	1,904	1,907	రూ. 8.19 కోట్లు
పలాస	2,071	912	1,159	రూ. 5.37 "
ఇచ్ఛాపురం	816	192	816	రూ. 97.41 లక్షలు
ఆముదాలవలస	528	416	112	రూ.39.29 "

ఎవరూ పట్టించుకోవడం లేదు..



కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. సొంతిల్లు వస్తుందని చెబితే రూ.50 వేలు చెల్లించా. ఐదేళ్లు దాటినా రాలేదు. మా బాధ ఎవరూ పట్టించుకోవడం లేదు. వివాదంలో ఉన్న స్థలం చూపడంతో ఇల్లు నిర్మించుకోలేకపోయాం. ప్రభుత్వం డిపాజిట్ సొమ్ము తిరిగి ఇప్పించాలి. – జి.లచ్చయ్య, ఇచ్ఛాపురం

ప్రభుత్వం ఆదుకోవాలి..

ఇళ్లు రద్దయిందని చెప్పి దీపావళి వద్ద సెంటు ఇంటిస్థలం ఇచ్చారు. అక్కడ వసతులు ఏమీ లేవు. అక్కడకు వెళ్లి బతకలేం. మావారు టైలరింగ్ చేసుకుంటూ అద్దెంటోనే జీవితం గడుపుతున్నాం. రూ.లక్ష అడిగితే మాకు ఇవ్వలేదు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఆదుకోవాలి. – బూర శారద, సొరంగడాలవీధి

అప్పు చేసి చెల్లించాం..



టిడ్కో ఇల్లు కోసం అప్పు చేసి రూ.50 వేలు చెల్లించాం. వైకాపా హయాంలో ఆశగా ఎదురుచూసినా సొంతింటి కల నెరవేరలేదు. ఈ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – ఆర్.గోపి, పలాస



పలాసలో పురపాలక సంఘ కార్యాలయంలో నగదు విషయమై ఆరా తీస్తున్న ఇళ్లు రాని వారు

ఉన్నతాధికారులకు నివేదించాం..

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించడానికి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నాం. గృహాలు రాని వారిలో కొందరికి స్థలం కేటాయించాం. డీడీ రూపంలో చెల్లించిన డిపాజిట్ సొమ్ము తిరిగి ఇచ్చే విషయమై ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఉన్నతాధికారులకు నివేదించాం. – సీతారామమూర్తి, కార్యనిర్వాహక ఇంజినీరు, టిడ్కో, శ్రీకాకుళం

ఉత్తరాంధ్ర, ఒడిశాను కలుపుతూ రైల్వేలైన్ ఏర్పాటుకు వినతి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: విజయనగరం, శ్రీకాకుళం, విశాఖను ఒడిశా రాష్ట్రానికి కలుపుతూ నూతన రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు దిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడుల సమక్షంలో సోమవారం రైల్వేమంత్రికి వినతిపత్రం అందజేశారు. 20 ఏళ్ల నుంచి కావాలనుకుంటున్న రైల్వేలైన్ అని దాని ప్రాముఖ్యాన్ని సీఎం చంద్రబాబు రైల్వేమంత్రికి వివరించారని కలిశెట్టి తెలిపారు. ఈ రైల్వేలైన్ చీపురుపల్లి, రాజాం, పాలకొండ, సీతంపేట, కొత్తూరు, పర్లాఖెముండి, మెళియాపుట్టి, పలాసలను కలుపుతూ వెళుతుందన్నారు. దీనివల్ల మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న రైల్వే సమస్యలను కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు.



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి

గృహ నిర్మాణాల లక్ష్యాలు సాధించాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించాలని అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరం నుంచి సోమవారం దూరదృశ్య సమీక్ష ద్వారా ఆర్డీవోలు, పురపాలక కమిషనర్‌లు, ఎంపీడీవోలతో మాట్లాడారు. నిర్మాణం ప్రారంభం కాని గృహాలపై దృష్టి సారించాలన్నారు. పనులకు ఇసుక సమస్య తలెత్తదని.. మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. లేఅవుట్లలో విద్యుత్తు, నీరు తదితర వసతులు ఉండాలని ఎంపీడీవోలు, కమిషనర్లు స్వయంగా వెళ్లి పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. గుత్తేదారులతో మాట్లాడి నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు సీఐలకు బదిలీ

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జెట్టి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాశీబుగ్గ గ్రామీణంలో పని చేస్తున్న పి.ఈశ్వరరావును వీఆర్‌కు పంపారు. వీఆర్‌లో ఉన్న టి.త్రినేత్రిని మహిళా పోలీసు స్టేషన్‌కు, ఎం.తిరుపతిరావును కాశీబుగ్గ గ్రామీణ స్టేషన్‌కు బదిలీ చేశారు.

జిల్లాలో వివరాలు ఇలా..

పనులు	మండలాలు	కిలోమీటర్లు	కేంద్రం వాటా	రాష్ట్రం వాటా :	నిర్వహణకు మంజూరు చేసిన
6	4	13.7	రూ.6.14 కోట్లు	రూ.4.09 కోట్లు	మొత్తం : రూ.76.78 లక్షలు

గిరిశిఖరాన అభివృద్ధి బాటలు..!

- పీఎం జన్‌మన్ పథకంలో రహదారుల నిర్మాణం
- ఐదేళ్ల పాటు నిర్వహణకూ నిధులు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

వైకాపా పాలనలో గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, మరమ్మతులకు పంపిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో వారు డోలీలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షానికే బురదమయమై అడుగు ముందుకు పడని రోడ్లకు మహర్దశ పట్టించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ముందుకొచ్చాయి. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా మెళియాపుట్టి, మందస, పాతపట్నం, పలాస మండలాల్లోని గిరిజన ప్రాంతాల్లో ఎంపిక చేసిన రోడ్లను అభివృద్ధి చేయనున్నాయి.

- కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో రహదారి నిర్మాణాలను పూర్తి చేయనున్నాయి. వీటిని పంచాయతీరాజ్ శాఖకు అప్పగించడంతో త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నారు. జిల్లాలో ఆరు రహదారులకు రూ.10.23 కోట్లు, మరో ఆరు రహదారుల నిర్వహణకు రూ.76.78 లక్షలు మంజూరయ్యాయి.



టెక్కలిపట్నం నుంచి గంగన్నపేటకు వెళ్లే రహదారి దుస్థితి

మండలం	ఎక్కడి నుంచి ఎక్కడికి	దూరం (కి.మీ.)	నిర్మాణానికి	నిర్వహణకు (రూ.లక్షల్లో)
మందస	గౌడగురంటి - అంబటికంబారం	6.80	3.65 రూ.కోట్లలో	27.37
మెళియాపుట్టి	టెక్కలిపట్నం, గొప్పిలి రోడ్డు - గంగన్నపేట, ఎస్ఎల్‌పురం	2.70	2.65 "	19.87
మెళియాపుట్టి	నేలబొంతు రోడ్డు - అంపురం వరకు	1.92	1.90 "	14.24
మెళియాపుట్టి	ఆల్ ఆంధ్ర రోడ్డు- కొత్తపేట	1.00	92.00 రూ.లక్షల్లో	6.90
పాతపట్నం	పీటీ రోడ్డు- ద్వారకాపురం	0.69	63.00 "	4.73
పలాస	ఎం.ఎం.రోడ్డు - తుసరాడ, హొల్దిగాం, జెన్నసాయి	0.59	49.00 "	3.67

సిక్కోలు జీవనాడి నిర్వహణ గాలికి..!

రాష్ట్రంలోనే ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో గొట్టా బ్యారేజీ ఒకటి.. వంశధార నదిపై గొట్టా గ్రామం వద్ద నిర్మించిన దీని ఆధారంగానే జిల్లాలో దాదాపు 2.30 లక్షల ఎకరాలకు సాగు నీరందుతోంది.. దీనికి అదనంగా ఎడమ, కుడి ప్రధాన కాలువలపై నిర్మించిన ఎత్తిపోతల పథకాల ద్వారా వందల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. అయిదేళ్ల వైకాపా పాలనలో కనీసం దీని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. నిర్వహణను గాలికి వదిలేశారు.. సిక్కోలు జీవనాడిగా మారిన ప్రాజెక్టు నిర్వహణలో ఇంజినీర్లు, సిబ్బంది కొరత వేధిస్తోంది. 16 మంది సిబ్బందికి కేవలం ముగ్గురే ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



బ్యారేజీ దిగువన దెబ్బతిన్న ఏప్రాన్

- గొట్టా బ్యారేజీ పరిధిలో ఇంజినీర్ల పోస్టుల ఖాళీ
- 24 మంది సిబ్బందికి ఉన్నది ముగ్గురే

న్యూస్‌టుడే, హిరమండలం

వంశధార నరసన్నపేట డివిజన్ ఈఈ కార్యాలయం పర్యవేక్షణలో హిరమండలం గొట్టా బ్యారేజీ సబ్‌డివిజన్ కార్యాలయం ఇంజినీర్లు విధులు నిర్వహిస్తున్నారు. సెక్షన్ కార్యాలయం వద్ద ఒక రెగ్యులర్ డీఈఈ, నలుగురు ఏఈలు విధులు నిర్వహించాల్సి ఉంది. డీఈఈతో పాటు ఇద్దరు ఏఈలు కొద్దిరోజుల కిందట బదిలీ అయ్యారు. బదిలీ అయిన డీఈఈ టి.హరిప్రసాద్ స్థానంలో ఆమదాలవలస డివిజన్ కార్యాలయ పరిధిలో ఉన్న హిరమండలం-1 రెగ్యులర్ డీఈఈ ఎన్.గణేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. బ్యారేజీ కార్యాలయ పరిధిలో ఉన్న ఇద్దరు ఏఈలు పరిశుద్ధ బాబు బుడితి సెక్షన్, కె.ధనుంజయరావు శ్రీముఖలింగం సెక్షన్ పరిధిలోని వంశధార ఎడమ ప్రధాన, పిల్ల కాలువలను పర్యవేక్షిస్తున్నారు. గొట్టాబ్యారేజీ నిర్వహణ, ఎడమ కాలువ హెడ్‌రెగ్యులేటర్ ప్రారంభం నుంచి కిట్టాలపాడు వరకు ఉన్న ప్రధాన, పిల్ల కాలువలను పర్యవేక్షించేందుకు ఉన్న ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

వంశధార నదిలో వరదలొచ్చే సమయంలో తప్పనిసరిగా 24 గంటల పర్యవేక్షణ అవసరం. బ్యారేజీ దిగువ దెబ్బతిన్న ఏప్రాన్ పనులు నిర్వహించేందుకు రూ.12 కోట్లు, బ్యారేజీ కుడివైపు కోతకు గురైన గట్టు పనులు చేసేందుకు రూ.28 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు ప్రారంభమైతే పర్యవేక్షించేందుకు అధికారుల కొరత ఏర్పడుతుంది. గేట్ల నిర్వహణకు విద్యుత్తు సరఫరా, ఇతర ఏర్పాట్లు నిత్యం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన బ్యారేజీ వద్ద ఇంజినీర్ల కొరతతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశముంది.

ఉన్నవారిపై ఒత్తిడి..

బ్యారేజీ వద్ద గేట్లు ఎత్తివేత, దించివేత, విద్యుత్తు సరఫరా పనులు, గ్రీజు రాయడం, ప్లంబర్లు, మూడు షిఫ్టుల్లో ఇతర పనులు నిర్వహించేందుకు 24 మంది రెగ్యులర్ నాలుగో తరగతి ఉద్యోగులు ఉండేవారు. వారంతా ఉద్యోగ విరమణ చెందాక ఆ పోస్టులు భర్తీ చేయక ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ముగ్గురు రెగ్యులర్ ఉద్యోగులే ఉన్నారు. దీంతో వీరిపై పని ఒత్తిడి పడుతోంది. వరదల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ఇంజినీర్ల పోస్టులు ఖాళీగా ఉన్న సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తాం. సిబ్బందిలో కొందరు పదవీ విరమణ చేయడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఇవి భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతాం. – ప్రదీప్‌కుమార్, వంశధార నరసన్నపేట డివిజన్ కార్యాలయం ఈఈ

జడ్పీ సీఈవోగా శ్రీధర్‌రాజు



శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆ పోస్టులో పనిచేసిన వెంకటేశ్వరరావును ప్రభుత్వం రెవెన్యూ శాఖకు బదిలీ చేసింది. ఆ స్థానంలో విజయనగరం సీఈవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌రాజును ఇక్కడ నియమించింది.

డీపీవోగా భారతీ సౌజన్య



జిల్లా పంచాయతీ అధికారిగా (డీపీవో) కె.భారతీసౌజన్య బాధ్యతలు చేపట్టారు. ఆ పోస్టులో పని చేస్తున్న వెంకటేశ్వరరావు విజయనగరానికి బదిలీ కాగా కాకినాడలో విధులు నిర్వహిస్తున్న భారతీ సౌజన్య నియమితులయ్యారు.

బరువులెత్తి.. పతకాలు పట్టి!

● జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో తలపడేందుకు జిల్లాకు చెందిన పలువురు సిద్ధమయ్యారు. ఆగస్టులో అనకాపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి ముగ్గురు బాలికలు, ఇద్దరు బాలురు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిలో గుజ్జల వర్షిత స్ట్రాంగ్ ఉమెన్, బెస్ట్ లిఫ్టర్‌గా, ముద్దాడ తరుణ్ స్ట్రాంగ్ మెన్ పురస్కారాలు సొంతం చేసుకున్నారు. హిమచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 13 వరకు పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి తొలిసారి అయిదుగురు జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వెయిట్‌లిఫ్టింగ్ శిక్షకుడు ఇప్పిలి అప్పన్న తెలిపారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.


– న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

అంతర్జాతీయ పోటీల్లో మెరవాలని..




గార మండలం అంపోలు పంచాయతీ ఆడవరం గ్రామానికి చెందిన **గుజ్జల వర్షిత** తండ్రి ప్రోత్సాహంతో రాణిస్తోంది. 64 కిలోల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడు పసిడి పతకాలు సాధించి బెస్ట్ లిఫ్టర్, స్ట్రాంగ్ ఉమెన్‌గా పురస్కారాలు అందుకుంది. ఇప్పటికే రెండు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో రాణించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించిన పోటీల్లో 7, చెన్నైలో నిర్వహించిన ఖేలోఇండియా పోటీల్లో 5వ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో 5 స్వర్ణాలు, 4 రజతాలు, 2 కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. అంతర్జాతీయ పోటీల్లో రాణించాలనే లక్ష్యంతో సాధన చేస్తోంది.

తండ్రి శిక్షణలో..



శ్రీకాకుళం గ్రామీణ మండలం ముద్దాడపేట గ్రామానికి చెందిన **ముద్దాడ తరుణ్** విశాఖపట్నంలో ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి సూర్యారావు అక్కడే రైల్వేలో సీనియర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. తల్లి అప్పన్నమ్మ గృహిణి. ఏడేళ్లుగా తండ్రి శిక్షణలో సాధన చేస్తున్నాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్ట్రాంగ్ మెన్ పురస్కారం సాధించాడు. గతేడాది తమిళనాడులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం దక్కించుకున్నాడు. ఖేలో ఇండియా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్ర స్థాయిలో 3 స్వర్ణాలు, కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు

పతకమే లక్ష్యంగా..




గార మండలం బూరవల్లి గ్రామానికి చెందిన **దూబ హేమశ్రీ** శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. తండ్రి రాంబాబు రోజు కూలీ, తల్లి విజయ కుట్టు పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్దపాడులోని రెయ్యిమ్మతల్లి వ్యాయామశాలలో ఇప్పిలి అప్పన్న వద్ద నాలుగున్నరేళ్లుగా సాధన చేస్తోంది. పంజాబ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటింది. రాష్ట్ర స్థాయిలో 3 స్వర్ణాలు, 5 రజతాలు, 4 కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. జాతీయ స్థాయిలో పతకం సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తోంది.


జగన్మాతా పాహిమాం..

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు, పీఠాలు, మందిరాల్లో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల మహిళలు సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం చేశారు. శ్రీకాకుళం నగరంలోని పలు దేవాలయాలు, మండపాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం



శ్రీకాకుళం: నానుబాల వీధిలో విజయదుర్గాదేవి



సారవకోట అవలింగిలో శాకంబరిగా నీలమణి అమ్మవారు



ఎల్ఎన్‌పేట: మల్లికార్జునపురంలో మహాచండీ రూపంలో దుర్గాదేవి



సోంపేట: పట్టుశాలి వీధిలో సరస్వతీదేవికి చిన్నారుల నాట్య నీరాజనం



మెళియాపుట్టి మండలం చాపర రాజరాజేశ్వరీదేవి పీఠంలో పూజలు

కుందువానిపేట తీరంలో అగ్ని ప్రమాదం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కిశోర్‌వర్మ, మాజీ సర్పంచి అప్పన్న

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం కుందువానిపేట తీరంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరవాత అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వలలు, పాకలు దగ్ధమయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గొంటి నిరందకు చెందిన పాకలో ఆయనతో పాటు చోడిపల్లి శివన్నారాయణకు చెందిన మొత్తం ఐదు వలలు, దాసరి తులసమ్మకు చెందిన దుకాణం కాలి బూడిదయ్యాయి. దుకాణంలో రెండు ఫ్రిడ్జ్‌లు, గ్యాస్ స్టవ్ ఉన్నాయి. సుమారు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా. గ్రామీణ ఎస్సై కిశోర్‌వర్మ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ మద్యం పెద్దఎత్తున విక్రయిస్తున్నారని స్థానికులు తెలిపారు. మందుబాబులు సముద్రంలో స్నానానికి వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారని.. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయిలో సాధించిన పతకాలతో బెవర హారిక

నరసన్నపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-20 విభాగంలో ప్రతిభ చూపిన బెవర హారిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. నరసన్నపేట పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హారిక ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన 37వ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో పరుగు పందెంలో తొలిస్థానం, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల వ్యాయామ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ తెలిపారు. క్రీడాకారిణిని ప్రిన్సిపల్ మురళీనాయుడు, అకడమిక్ ఇంఛార్జి ఎం. శ్రీనివాసరావు, ఏవో మెండ మోహనరావు అభినందించారు.

రావులవలస వాసిపై పోక్సో కేసు నమోదు

పోలాకి, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం రావులవలస గ్రామానికి చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. రంజిత్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పోలాకి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు నరసన్నపేట మండలం రావులవలసకు చెందిన దొంతా రాముకు కొంత కాలంగా పరిచయం ఏర్పడింది. బాలికతో ఉన్న చనువు ఆసరాగా చేసుకుని సదరు యువకుడు పోలాకిలోని సముద్రతీరానికి ఆదివారం తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కుమార్తె ముభావంగా ఉండటం గమనించిన తల్లి ఎక్కడికి వెళ్లావని ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. తల్లి సోమవారం శ్రీకాకుళంలోని ఎస్పీ కార్యాలయంలో తన కుమార్తెపై అత్యాచారం జరిగినట్లు ఫిర్యాదు చేసింది. ఎస్పీ కార్యాలయం నుంచి కేసు నమోదు చేసే చర్యలు తీసుకోవాలని పోలాకి పోలీసులకు సమాచారం అందింది. దీంతో రాముపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దీనిని డీఎస్పీ విచారణ చేయనున్నారని చెప్పారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	140	235	255

రైతేరాజు

ఆకుకూరలు.. రైతు ఇంట సిరులు..!

-న్యూస్‌టుడే, జలుమూరు

ఆకు కూరల పంటల సాగుతో మంచి ఆదాయం పొందవచ్చని చెబుతున్నారు జలుమూరు మండలం అల్లాడకు చెందిన మహిళా రైతు దామోదర భారతి. కొంత కాలంగా సాగు చేస్తూ విక్రయించి ఆదాయం పొందుతున్నట్లు పేర్కొంటున్నారు. తమకు ఉన్న వ్యవసాయ పొలంలో 10 సెంట్ల విస్తీర్ణంలో తోటకూర, గోంగూర, ముల్లంగి, వంటి ఆకు కూరలను ఏడాదిలో మూడు పంటలు పండిస్తున్నారు. పొలం మెత్తగా దుక్కి చేసిన తరువాత పశువుల ఎరువు, సేంద్రియ ఎరువు ఎక్కువగా వినియోగించారు. విత్తనాలు వేసేముందు, నీటి తడులు, ఎరువులు వంటి వాటికి ఒక పంటకు సుమారు రూ.3 వేల వరకు పెట్టుబడి అవుతుందని, అన్ని ఖర్చులు పోను రూ.9 వేల వరకు ఆదాయం వస్తుంది. ఏడాదిలో మూడు పర్యాయాలు పంట చేతికి అందుతుందని రూ.27 నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తుందని ఆమె తెలిపారు.



అల్లాడ వద్ద బాగా పెరిగిన గోంగూర పంట

ప్రకృతి అనుకూలిస్తే లాభదాయకమే: ప్రకృతి అనుకూలిస్తే ఆకు కూరల పంటల సాగు లాభదాయకమే. వీటిని విక్రయించగా వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణ జరుగుతోంది. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు పండిస్తుంటాం. బోరు బావి నీటిని మోటార్ల సహాయంతో అందిస్తాం. మోటారు వాహనాలపై దూర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటాం. - దామోదర భారతి, మహిళా రైతు అల్లాడ



సస్యరక్షణ చర్యలు ఇలా..: నీరు నిల్వలేని ప్రాంతం అనుకూలం. వరుస క్రమంలో ఆకు కూర విత్తనాలు విత్తుకుంటే మంచిది. విత్తనం వేసే ముందు వేప నూనెలో 15 నిమిషాలు నానబెట్టి, అనంతరం పొడి చేసిన తరువాత పొలంలో విత్తుకోవాలి. పంట వేసిన 25 రోజుల్లో కోతకు వస్తుంది. కోసిన తరువాత లీటరు నీటికి 25 గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు వ్యాపిస్తుంది. దాని నివారణకు వేప నూనె, మలాథియాన్ లీటరు నీటికి 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. తరువాత వారం రోజుల వరకు కోయరాదు. చల్లని వాతావరణంలో మంచి దిగుబడులు వస్తాయని ఉద్యానశాఖ ఏడీ ప్రసాదరావు తెలిపారు.

వరుస క్రమంలో నాట్లు వేస్తే ఎక్కువ పిలకలు



వెద, వరుస క్రమంలో సాగు చేసిన వరి దుబ్బులను చూపిస్తున్న రైతు రామ్మోహనరావు

సారవకోట, న్యూస్‌టుడే: వరుస క్రమంలో వరి నాట్లు వేస్తే అధిక పిలకలు వస్తాయని, తద్వారా దిగుబడి పెరుగుతుందని ఏవో కేసీహెచ్.వెంకటరావు సూచించారు. వెద రూపంలో వరి సాగు చేస్తే ఒక దుబ్బుకు 2 నుంచి 10 వరకు పిలకలు మాత్రమే వస్తాయని, యంత్రం సహాయంతో గాని, కూలీలతో గాని వరుస క్రమంలో నాట్లు వేయడంతో 30 నుంచి 40 వరకు పిలకలు వస్తాయన్నారు. ఎకరా విస్తీర్ణంలో వెద రూపంలో వరి సాగు చేస్తే 25 బస్తాలు దిగుబడి వస్తుందని, వరుస క్రమంలో సాగు చేస్తే 35 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ఆయన తెలిపారు.



గ్రామాల్లో పంటలను సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలతో పాటు పైరును ఆశించే వివిధ రకాల పురుగులు, తెగుళ్ల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చో ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష తెలిపారు. రైతులు ఫోన్‌లో అడిగిన ప్రశ్నలకు ఆమె ఇలా సమాధానాలు ఇచ్చారు.

-న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

పైరును ఆశించే తెగుళ్లు.. నివారణ చర్యలు

ప్రశ్న: వరి పైరులో మొదళ్ల వద్ద బూడిద రంగు మచ్చలు కనిపిస్తున్నాయి. దుబ్బులను దోమ కూడా ఆశించి నష్టపరుస్తోంది. నివారణ చర్యలు తెలపండి. - ఎస్.రాములు, చింతాడ, ఆమదాలవలస మండలం

సమాధానం: వర్షాలు పడి ఆగడం వల్ల ప్రస్తుతం ఉష్ణోగ్రత పెరగడంతో సాంబ, స్వర్ణ వరి రకాల్లో దోమ ఉద్ధృతితో పాటు పొడ తెగులు కనిపిస్తోంది. దీని నివారణకు మెట్రొజైన్ 120 గ్రాములు లేదా డైనోటెఫ్యూరాన్ 80 గ్రాములు, హెక్సాకొనజోల్ 400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో దుబ్బులు తడిసేలా పిచికారీ చేయాలి.

? : పెసర పంట సాగు చేయాలనుకుంటున్నాం. విత్తనశుద్ధి ఏవిధంగా చేయాలో తెలపండి. -కె.సురేష్, గులుమూరు, బూర్జ మండలం

➔ : పెసర విత్తనాలను ముందుగా ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ., లేదా థయామిథాక్సామ్ 5 గ్రాముల మందులో కిలో విత్తనాల చొప్పున కలిపి ఆ తరువాత కార్బెండజిమ్ లేదా మ్యాంకోజెబ్ 1 గ్రాములో కిలో విత్తనం చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. ఇందువల్ల మొదటి దశలో ఆశించే తెగుళ్లు, పురుగులను అరికట్టవచ్చు.

? : వేరుసెనగలో ఏటా వేరుకుళ్లు తెగులు వచ్చి మొక్కలు చనిపోతున్నాయి. దీని నివారణ చర్యలు తెలపండి. - పి.చిన్ననాయుడు, చెట్టుపొదిలాం, జి.సిగడాం మండలం

➔ : వేరుసెనగలో వేరుకుళ్లు తెగుళ్లను నివారించాలంటే భూమిలో దాగి ఉన్న శిలీంద్రాన్ని తగ్గించుకోవాలి. దీని నివారణకు పశువుల పెంటతో పాటు ట్రైకోడెర్మావిరిడే అనే శిలీంద్రాన్ని కలిపి భూమికి అందించడం వల్ల హానికారక శిలీంద్రాన్ని తగ్గించుకోవచ్చు.

సప్తధాన్యాంకుర కషాయంతో వరి పంటకు మేలు

-న్యూస్‌టుడే, జలుమూరు, పొందూరు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి మేరి

వరి పంటలో గింజ నాణ్యత, బరువు వచ్చేందుకు సప్తధాన్యాంకుర కషాయం ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌ఛార్జి డి.మేరి పేర్కొన్నారు. ఈ కషాయం వరి పంట వెన్నువచ్చే దశలో ఎకరాకు పది లీటర్లు పిచికారీ చేస్తే బాగుంటుందన్నారు. ఎకరా విస్తీర్ణం పొలానికి దీని తయారీకి పెసలు, మినుములు, నువ్వులు, కందులు, బొబ్బర్లు, కొమ్ము సెనగలు, గోధుమలు 100 గ్రాముల చొప్పున తీసుకోవాలి. వాటిని నానబెట్టి 24 గంటల తరువాత తీసి పొడి గుడ్డలో కట్టాలి. మొలకలు వచ్చిన తరువాత వాటిని మెత్తగా రుబ్బాలి. 200 లీటర్ల నీటిని తీసుకొని వాటిలో వేయాలి. 10 లీటర్ల ఆవు మూత్రం వాటితో కలిపి మరో 24 గంటలు ఉంచాలి. దీంతో సప్తధాన్యాంకుర కషాయం తయారవుతుంది. దీన్ని కోతకు వచ్చే ముందు రెండు పర్యాయాలు వరి పంటపై పిచికారీ చేస్తే మంచి దిగుబడితో పాటు నాణ్యమైన గింజలు వస్తాయని డి.మేరి తెలిపారు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు
సాగులో చీడపీడల నివారణ, కొత్త వంగడాలు, ఇతర సమస్యలపై కేవీకే ఆమదాలవలస ఉద్యానశాఖ శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్.. 8281440912 చరవాణి నంబరును సంప్రదించగలరు.

కబడ్డీ జట్టు విజేత విశాఖపట్నం



ట్రోఫీ అందుకుంటున్న శ్రీకాకుళం జట్టు క్రీడాకారులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల కబడ్డీ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 156 మంది క్రీడాకారులు రెండు రోజుల పాటు హోరాహోరీగా తలపడి క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ పోటీల్లో విశాఖపట్నం జట్టు ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ, శ్రీకాకుళం జట్టు తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన ఉత్తమ క్రీడా నైపుణ్యాలు ప్రదర్శించిన 17 మంది క్రీడాకారులను జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే ఈ క్రీడాకారులకు కొద్ది రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని మంచి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాష్ట్రానికి గుర్తింపు తెచ్చేలా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఒలింపిక్ సంఘ ముఖ్య సలహాదారులు పి.సుందరరావు, పీడీ, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, టోర్నమెంట్ పరిశీలకులు పి.రాము, ఎస్.జి.ఎఫ్. జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా గ్రిగ్స్ కార్యదర్శి కె.మాధవరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సుభలయ వాసి బలవన్మరణం

హిరమండలం, న్యూస్‌టుడే: సుభలయ గ్రామానికి చెందిన పి.రామారావు (63) సోమవారం మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై ఎండీ యాసిన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామారావు క్షయ, ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ.. మనస్తాపంతో ఇంట్లోని ఓ రసాయనం తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు హిరమండలం పీహెచ్‌సీకి తరలిస్తుండగా మృతి చెందారు. ఆయనకు భార్య పార్వతి, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పురుగుమందు తాగి వృద్ధుడు..

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం మాకివలస గ్రామానికి చెందిన పిసినికి పెంటయ్య (64) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పెంటయ్య తనకు ఉన్న 40 సెంట్ల భూమిలో వరి సాగుచేస్తున్నారు. పంటకు తెగులు రావడంతో ఆదివారం పురుగు మందు పిచికారీ చేశారు. పంట పాడవడం, పిల్లలు లేకపోవడంతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను గుర్తించిన కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. భార్య రాజులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌బాబు పేర్కొన్నారు.



పెంటయ్య (పాత చిత్రం)

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

పేదలు సద్వినియోగం చేసుకోవాలి

సోంపేట, న్యూస్‌టుడే: గుండెపోటు సంబంధిత ఇబ్బందులకు తక్షణ చికిత్సగా వినియోగించే ఖరీదైన టెనెక్టెప్లేజ్ ఇంజెక్షన్ సామాజిక ఆసుపత్రుల్లో వినియోగించే అవకాశం రావడంపై పేదవర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. గుండెపోటు వచ్చిన వారు తక్షణ చర్యల్లో భాగంగా ఈ ఇంజెక్షన్ వినియోగిస్తారని దీని ఖరీదు రూ.40 వేలు పైగానే ఉంటుందని సోంపేట సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.వెంకటేష్ తెలిపారు. కవిటి మండలం బెవరాపుట్టుగకు చెందిన దామోదర్ సోమవారం గుండెపోటు లక్షణాలతో ఆసుపత్రికి రాగా అత్యవసర చికిత్స కింద ఈ ఇంజెక్షన్ వేసి శ్రీకాకుళం తరలించామని చెప్పారు. పేదవర్గాలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పింఛను అందక ఇబ్బందులు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వితంతు పింఛను మంజూరు చేయాలని పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం 19 వార్డుకు చెందిన పలువురు మహిళలు పేర్కొన్నారు. ఈ మేరకు పలాస ఇన్‌ఛార్జి ఆర్డీవో సుదర్శన్ దొరకు సోమవారం వినతి పత్రం అందించారు. పింఛను అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు.



వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సుదర్శన్ దొర

రసవత్తరంగా కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానం రామకృష్ణాపురంలో సరస్వతి పూజ మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో 110 జట్లు పాల్గొన్నాయి. ఆట ముగిసే సమయానికి కొత్తపేటపై ఉద్దానం రామకృష్ణాపురం, పాతటెక్కలిపై టెక్కలి-బి, రావివలసపై రెయ్యిపాడు జట్లు గెలుపొందాయి. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే గౌతు శిరీష పోటీలను ప్రారంభించారు.



తలపడుతున్న రెయ్యిపాడు-రావివలస జట్లు

పాత భవనాల ఫలితం.. పడకేసిన పశువైద్యం

అవస్థలు పడుతున్న సిబ్బంది, పశుపోషకులు



పశు వైద్యం గాలిలో దీపంలా మారింది. పాడి పశుపోషకుల బాగోగులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వైద్యం కోసం వచ్చే పశుపోషకులు సైతం భయాందోళన మధ్య గడుపుతున్నారు. పశువులను వైద్యశాలకు తీసుకొచ్చే వారు కూడా క్రమంగా తగ్గిపోతున్నారు

– న్యూస్‌టుడే కవిటి గ్రామీణం

పట్టించుకోని అధికారులు

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో 10 పశు వైద్యశాలలు ఉండగా, రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్స్(ఆర్ ఎల్‌యూ) కవిటి మండలంలో రాజపురం, శిలగాం, ఇచ్ఛాపురం మండలంలో డొంకూరు, తోటూరు, కంచిలి మండలంలో జె.భైరిపురంలో మొత్తం అయిదు చోట్ల ఉన్నాయి. బారువ ఆసుపత్రి, శిలగాంలో ఆర్ఎల్‌యూ భవనాలు మాత్రమే కొత్తగా నిర్మించారు. మిగతా భవనాలు అన్నీ 40 ఏళ్ల క్రితం నిర్మించడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులకు గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. నూతన భవనాల ఏర్పాటు ఊసే లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో పశుపోషకులు, సిబ్బంది పడే ఇక్కట్లు పాలకులకు, పైఅధికారులకు పట్టడం లేదు. వర్షం వస్తే పైకప్పు కారి గదులు నీటితో నిండిపోతున్నాయని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.

నిర్మాణాలు చేపట్టాలి

ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పశుపోషకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పశు వైద్యశాలలు నిర్మాణాలు చేపట్టాలి. గత ప్రభుత్వం నిలిపివేసిన పాడి రైతుల పథకాలను మళ్లీ అమలు చేసి పాడి రైతులను ఆదుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాలలు ఎక్కడెక్కడ ఉన్నాయో వాటి వివరాలను ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే వాటి మరమ్మతులు, కొత్తభవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.

– అప్పలస్వామి పశుసంవర్ధక శాఖ, ఏడీ, సోంపేట

రైతులకు భూమి హక్కు పత్రాలు అందించండి

సోంపేట, న్యూస్‌టుడే: తరాలుగా సాగు చేస్తున్న తమ భూములకు సంబంధించిన అడంగల్, ఇతర హక్కు పత్రాలు జారీ చేసేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కొర్లాం రైతులు కోరారు. సోమవారం రైతు ప్రతినిధులు రాంబుడ్డి గణపతి, జానకిరావు, చంద్రశేఖర, రవణయ్య సోమేష్ తదితరుల ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కొర్లాం అగ్రహారం ఆయకట్టు పరిధిలో సర్వే నెంబర్ 50 నుంచి 110 వరకు 250 ఎకరాల పంటపొలాలను ఇనాం భూముల పేరిట ఒడిశాకు చెందిన వ్యక్తి.. గత ప్రభుత్వం హయాంలో తన పేరిట నమోదు చేయించుకున్నారని, దాంతో రైతుల పేరిట అడంగల్, ఇతర పత్రాలు రావడం లేదని వివరించారు. తాత, ముత్తాతల కాలం నుంచి ఈ భూములు సాగు చేస్తున్నామని న్యాయం చేయాలని కోరగా ఫర్మాన్ అహ్మద్ పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.



సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌కు వినతిపత్రం ఇస్తున్న కొర్లాం రైతులు

9న విజయవాడలో బీసీ సంఘాల ధర్నా

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: బీసీ సంఘాలు, ఉప సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద 9న మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు బహుజన సమాజ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేదవర బిశోయ్ అన్నారు. కుల విభజన కోరుతూ నిర్వహించే ఈ ధర్నాలో జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని, బీసీలు, ఉప కులాల సమైక్యతను చాటుదామని పిలుపునిచ్చారు.

చిన్నారికి చేయూత

కవిటి, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : సోంపేట మండలం మండపల్లి గ్రామానికి చెందిన డిక్కల హనీష్ అనే బాలుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కవిటికి చెందిన ఎస్‌జీఎఫ్ సభ్యులు తమ సంస్థ ద్వారా విరాళాలు సేకరించి సోమవారం రూ. 72,412లు ఆర్థిక సాయం అందజేశారు. మిగతా స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి విరాళాలు అందజేసి బాలుడిని ఆదుకోవాలని కోరారు. ● కవిటి మండలం పరిధి జల్లుపుట్టుగ గ్రామానికి చెందిన జశ్వంత్ జెన్న (13) గుండెకు సంబంధించిన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు సోమవారం రూ. 15 వేలు ఆర్థిక సాయం చేశారు.

కుక్కల బెడద...!

పలాస మండలం బంటుకొత్తూరులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు దాడి చేస్తాయో అన్న భయంతో ఉంటున్నామని తెలిపారు. రాత్రి వేళలో గ్రామంలో తిరగడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని, కుక్కల బెడద తీర్చాలని కోరుతున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి మోహనరావు దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, పలాస గ్రామీణం



సుజలధార వృథా



మందస మండలం సువర్ణాపురం సమీపంలో గ్రామాలకు శుద్ధ జలం అందించే సుజలధార పథకం పైపులైను లీకవుతుంది. దీంతో నీరు మట్టి రోడ్డుపై నిలిచి గుంతలా ఏర్పడుతోంది. రెండు రోజులుగా ఇలా జరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఉద్దానం గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని గ్రామీణ నీటిసరఫరా ఏఈ ప్రజన్న తెలిపారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

రెండేళ్లకే అధ్వానం..

జాతీయ రహదారి నుంచి మండలాభివృద్ధి, తహసీల్దారు కార్యాలయాల వరకు సుమారు రెండువందల మీటర్ల మేర సీసీ రోడ్డు రెండేళ్లకే ధ్వంసమైంది. నాణ్యత లోపంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నూతన సీసీ రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు. పంచాయతీ రాజ్ జేఈ హిమసాగర్ వద్ద ప్రస్తావించగా నూతన రహదారి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం



రేషన్ పంపిణీలో సాంకేతిక సమస్యలు



గ్రామీణం వజ్రపుకొత్తూరు మండలం పీఎంపురంలో చౌకధరల దుకాణం ద్వారా సరకులు అందించేందుకు సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. సోమవారం సిగ్నల్ సమస్య కారణంగా గ్రామానికి కిలోమీటరు దూరంలోని చెట్టు వద్దకు వచ్చి వేలిముద్రలు సేకరిస్తున్న దృశ్యమే ఇది. సరకులు అందించే సమయంలో సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

సచివాలయాల సేవలపై అవగాహన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: సచివాలయాల్లో విభాగాలు, ఆయా కేంద్రాల్లో ప్రజలకు అందే సేవాకార్యక్రమాలు, విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వృత్తివిద్య కోర్సులను చేసే విద్యార్థులకు సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథం ఆధ్వర్యంలో బెల్లుపడ సచివాలయాన్ని సందర్శించారు.



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న హెచ్‌ఎం విశ్వనాథం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	9440437129
పలాస	8008574279
కవిటి గ్రామీణం	8309638875
పలాస గ్రామీణం	7386408926
కంచిలి గ్రామీణం	9704568738

సమస్య : పట్టణం జీపీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - **పి.భారతి, ఇచ్ఛాపురం**

సమాధానం : పరిశీలించి, చర్యలు తీసుకుంటాం

- **పి.కామేశ్వరరావు, ఏఈ, ఇచ్ఛాపురం**

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పంచాయతీ అభివృద్ధిలో వార్డు సభ్యులే కీలకం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ

కవిటి గ్రామీణం, పలాస గ్రామీణం, నూస్‌టుడే: పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచు, వార్డు సభ్యులే కీలకమని ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామ పంచాయతీలో పన్నుల వసూళ్లు, ఆర్థికాభివృద్ధి, పంచాయతీల సంపూర్ణ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శివాజీ పాణిగ్రహి, శిక్షకురాలు జ్యోతి, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. ●పలాస మండలంలోని ఉప సర్పంచులు, పంచాయతీకి ఇద్దరు చొప్పున వార్డు సభ్యులకు పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. పంచాయతీ పరిపాలన విధానాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

వ్యక్తిగత ఖాతాలకు రుణాల సొమ్ము జమ చేయాలి



మాట్లాడుతున్న ప్రసాదరావు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళా సంఘాల సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు మంజూరు చేసిన రుణాలు జమ చేయాలని ఏపీఎం ప్రసాదరావు తెలిపారు. మండల ఇందిర క్రాంతి కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. బేస్‌లైన్ సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని పేర్కొన్నారు. మండలంలోని 1619 సంఘాలను 'ఏ' గ్రేడ్‌లోకి తీసుకు రావాలన్నారు.

అలరించిన సంగీత కచేరీ



త్యాగరాజకీర్తనలు ఆలపిస్తున్న పట్టాభిరామ పండిట్

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: స్వేచ్ఛావతి అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శాస్త్రీయసంగీత కచేరీ అలరించింది. బెంగుళూరుకు చెందిన సంగీత కళాకారులు పట్టాభిరామ పండిట్ పాల్గొన్నారు. శ్రీమహతి సాంస్కృతిక కళాసేవ సంస్థ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆముదాలవలస నుంచి ప్రముఖ వయోలిన్ విద్వాంసులు మావుడూరు సత్యనారాయణ శర్మ, మృదంగం విద్వాంసులు సూర్యప్రసాద్ శర్మ తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, ఎంపీపీ బోర పుష్ప, నర్తు నరేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పలాస-విజయవాడ బస్సు ప్రారంభం



పలాస నుంచి విజయవాడ వెళ్లే సూపర్‌లగ్జరీ అద్దె బస్సును పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. బస్సులో డిపో నుంచి కాశీబుగ్గ వరకు ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఆర్.సీతారామ నాయుడు, అసిస్టెంట్ డిపో మేనేజర్ పి.సంతోష్‌కుమార్, యూనియన్ నాయకులు, తెదేపా నేతలు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పలాస

ఎమ్మెల్యేను కలిసిన బాబూరావు

పలాస, న్యూస్‌టుడే: పాతపట్నం ఎమ్మెల్యే మామిడి.గోవిందరావు, తెదేపా జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణలను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే శాలువతో సత్కరించగా, కలమట వెంకటరమణ అభినందించారు. ● 23వ వార్డులో బాబూరావు పర్యటించారు. ప్రజల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



రైళ్లు నిలపాలని వినతి

హరిపురం (మందస), న్యూస్‌టుడే : మందస మండలం హరిపురం సమీపంలోని రైలు నిలయంలో విశాఖ, ప్రశాంతి, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని మండల కూటమి నేతలు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడిని కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో కొర్ల కన్నారావు, డి.తిరుపతిరావు, మార్పు వెంకటేశం తదితరులు ఉన్నారు.

అవీ..ఇవీ..అన్నీ

బాధ్యతల స్వీకరణ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: బదిలీపై వచ్చిన పలువురు అధికారులు సోమవారం విధుల్లో చేరారు. పలాస ఇన్‌ఛార్జి ఆర్డీవోగా సుదర్శన్ దొర బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్‌గా కల్యాణ చక్రవర్తి, పలాస నియోజకవర్గ ఎన్నికల ఉప తహసీల్దార్‌గా గిరిబాబు విధుల్లో చేరారు. ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా ప్రకాశ రావు బాధ్యతలు స్వీకరించారు.

శునకాలతో భయం.. భయం

పలాస, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో శునకాల బెడద తప్పించాలని కోఆప్షన్ సభ్యులు బమ్మిడి.సంతోష్‌కుమార్ విన్నవించారు. పురపాలక కమిషనర్ రామారావుకు సోమవారం వినతిపత్రం అందించారు. వార్డుల్లో కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే చర్యలుచేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

దహన ఖర్చులకు ఆర్థికసాయం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం మండలం కొలిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న లండ జగ్గారావు ఇటీవల మృతి చెందారు. ఆయన దహనసంస్కారాల నిమిత్తం ప్రభుత్వం రూ.25వేలు మంజూరు చేసింది. ఆ మొత్తానికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు రూ.15వేలు కలిపి, రూ.40 వేలను సోమవారం కుటుంబసభ్యులకు అందజేశారు.

వాహనాల తనిఖీ

హరిపురం, మందస, న్యూస్‌టుడే: మైనర్లు వాహనాలు నడపరాదని తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని మందస ఎస్సై ఖాదర్ భాషా పేర్కొన్నారు. హరిపురంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహన చోదకులతో సమావేశం నిర్వహించారు. రోడ్డుపై వాహనాలు నడిపేందుకు కావాల్సిన అర్హత, నియమావళి వివరించారు.

కార్మికుల పనితీరు పరిశీలన

పలాస, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ రామారావు ఆదేశించారు. పలాస పట్టణంలో కార్మికుల పనితీరు సోమవారం పరిశీలించి, మాట్లాడారు. తూతూమంత్రంగా పనిచేసి వెళ్లిపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వార్డుల్లో తాను ఆకస్మికంగా పరిశీలిస్తానన్నారు.



కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకొద్దాం



శేషగిరిరావుతో డీసీసీ అధ్యక్షులు అంబటి కృష్ణారావు

ఇచ్ఛాపురం, పలాస, న్యూస్‌టుడే: జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొద్దామని జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు అంబటి కృష్ణారావు అన్నారు. జిల్లా పార్టీ బాధ్యులు గాదం వెంకటత్రినాథరావుతో కలసి ఇచ్ఛాపురంలో ఆయన పర్యటించారు. వైఎస్ షర్మిల నాయకత్వంలో పార్టీ బలోపేతమవుతుందన్నారు. ఈ సందర్భంగా వైద్యుడు శేషగిరిరావును కలిశారు. ●పలాస ఇందిరాచౌక్ కూడలిలో స్వర్గీయ ఇందిరా గాంధీ విగ్రహాన్ని పురపాలక సంఘం అధికారులు ఏర్పాటు చేయాలని కృష్ణారావు కోరారు. పలాస ఇందిరాచౌక్ ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. అప్పట్లో ఇందిరా విగ్రహం వల్లే ఇందిరాచౌక్‌గా పేరొచ్చిందని, రహదారి వెడల్పు నిమిత్తం తొలగించారన్నారు.

అమ్మ ఉత్సవం.. అందరికీ ఆనందం

నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ అమ్మవారి ఆలయాల్లో భక్తులు నిత్య అభిషేకాలు, పూజలు చేస్తున్నారు. అన్నప్రసాద వితరణ జరుగుతోంది.

– న్యూస్‌టుడే, బృందం



ఇచ్ఛాపురం: స్కందమాతగా పూజలు అందుకుంటున్న స్వేచ్ఛావతి మాత



సోంపేట: అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిచ్చిన సోమపోలమాంబ

దుర్గాదేవికి ఎమ్మెల్యే పూజలు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ, కొత్తపేట, పాతటెక్కలి గ్రామాల్లో జరుగుతున్న దుర్గాదేవి శరన్నవరాత్రి పూజా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు.



కొమరల్తాడలో తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: వల్లభరాయపాడు కూడలి నుంచి భరణిగాం, దేవాడ, దొడ్లరామచంద్రాపురం వరకు గతంలో బీటీ రోడ్డు వేయడానికి కంకర వేసి వదిలేశారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - సిద్ధూ, భరణిగాం

● ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.
- మోహన్, ఏఈ, పీఐయూ, నందిగాం
– న్యూస్‌టుడే, నందిగాం

?: నందిగాం మండలం నర్సిపురం గ్రామంలో వీధి దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం వెలుగుతున్నాయి. అధికారులు స్పందించాలి. - గ్రామస్థులు

● సిబ్బందికి తెలియజేసి దీపాలు రాత్రి మాత్రమే వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- నేతాజీ, ఏఈ, విద్యుత్తు శాఖ, నందిగాం

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం


జలుమూరు: మాట్లాడుతున్న పంచాయతీరాజ్ సహాయ కమిషనర్ కృష్ణమోహన్

సారవకోట, జలుమూరు, నరసన్నపేట, పోలాకి, మెళియాపుట్టి, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీల అభివృద్ధికి అందరి భాగస్వామ్యం అవసరమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పంచాయతీరాజ్ శాఖ సహాయ కమిషనర్ కె.కృష్ణమోహన్ పేర్కొన్నారు. సారవకోట ఉపాధి కార్యాలయంలోని సమావేశ భవనంలో సోమవారం ప్రారంభమైన ఉప సర్పంచులు, వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విధులు, బాధ్యతలు తెలుసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం జలుమూరు, నరసన్నపేటలో నిర్వహించిన కార్యక్రమాల్లో కృష్ణమోహన్ పాల్గొన్నారు. ★ ప్రజా ప్రతినిధులు పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని శిక్షణాధికారి మహేష్ అన్నారు. పోలాకి మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ★ గ్రామస్థాయిలో ఆదాయ వనరులను ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నర్సింహ ప్రసాద్‌పండా సూచించారు. మెళియాపుట్టి ఉపాధి కార్యాలయం ఆవరణలో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి, మాట్లాడారు.

సమస్యలు లేని మండలంగా సారవకోట

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోటను సమస్యలు లేని మండలంగా తయారు చేయాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. సారవకోట మండల పరిషత్తు సమావేశ భవనంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీ కోసం' కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి 19 ఫిర్యాదులు, మండల పరిషత్తు 13, విద్యుత్తు శాఖ 3, నీటిపారుదల, విద్యాశాఖలకు సంబంధించి ఒక్కొక్క వినతి అందినట్లు తహసీల్దారు విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, మండల ప్రత్యేకాధికారి ఎం.లోకనాథం, ఎంపీడీవో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశ్రాంత సైనిక ఉద్యోగులకు సత్కారం



పాతపట్నం మండలం పెద్దసీదిలో సోమవారం విశ్రాంత సైనిక ఉద్యోగులను ఆజాద్ వెల్ఫేర్ అసోసియేషన్, మేజర్ చిన్నాల పాపారావు ఆధ్వర్యంలో సత్కరించారు. దేశ సరిహద్దుల్లో ఏళ్లపాటు సేవలందించి, ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన లాల్‌కిరణ్, రావాడ శ్యామ్‌సుందరరావు, బొజ్జ శంకర్‌లను సత్కరించి, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి.రామారావు, ఆజాద్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

అనుమతులు ఇక్కడ... తవ్వకాలు అక్కడ...!

కోటబొమ్మాళిలో సీనరేజీకి గండి

న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

కోటబొమ్మాళి మండలం రేగులపాడు పంచాయతీ పరిధిలోని సర్వేనెంబరులో ఓ గ్రానైట్ కంపెనీ లీజు అనుమతులు ఓ ప్రాంతంలో ఉండగా మరో ప్రాంతంలో భారీగా తవ్వకాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పెద్దఎత్తున సీనరేజీకి గండి పెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల అధికారుల తనిఖీల్లో ఈ దందా వెలుగులోకి వచ్చింది.


అనుమతుల్లేని ప్రాంతాల్లో భారీగా తవ్వకాలు

ఇదీ పరిస్థితి..

★ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా గ్రానైట్ పరిశ్రమల్లో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. సమీప ప్రాంతాలకు చెందిన కార్మికులకు ఉపాధి లేకపోవడం తెలిసిందే. ఇటీవల రేగులపాడులోని పరిశ్రమలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఏప్రిల్ 2012 నుంచి 2032 వరకు భూగర్భగనులశాఖ ఆ పరిశ్రమకు లీజు మంజూరు చేసింది.



రేగులపాడులో అనుమతులు తీసుకున్న ప్రాంతం

★ సుమారు నాలుగు హెక్టార్ల పరిధిలో ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు చేపట్టాలో స్పష్టంగా ధ్రువీకరించింది. రేగులపాడు రహదారి పక్కన, మరో ఇరవై అడుగుల దూరంలో హద్దులు నిర్ణయించారు. ఆయా ప్రాంతాల్లో కాకుండా మరో ప్రాంతాల్లో సదరు పరిశ్రమ వారు భారీ ఎత్తున తవ్వకాలు చేపట్టారు.

★ సంతబొమ్మాళి మండలంలో పోర్టు పనులు జరుగుతుండటంతో నిత్యం వందల లారీలతో సరకు తరలించినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు పరిశ్రమ ప్రాంతాలను సందర్శించి సమగ్ర పరిశీలనలు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

సదరు గ్రానైట్ పరిశ్రమ వారు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే సమాచారం మేరకు సమగ్ర విచారణ చేపడుతున్నాం. పరిధులు దాటి పనులు నిర్వహించడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో సమగ్ర పరిశీలన చేశాం. సర్వేయర్లు, గనులశాఖ సంయుక్తంగా లెక్కలు చూడాల్సి ఉంది. చెల్లింపుల లెక్క తేలాలి.
– డీవీవీ సతీష్, సీఐ, విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్, శ్రీకాకుళం


కొండ కింద నిల్వ చేసిన రాతి పొడి

పనికిరాని మొక్కల తొలగింపు

స్పందనకు వందనం

పోలాకి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎస్.ఎల్.పురం గ్రామం రహదారి పక్కన విద్యుత్తు నియంత్రిక చుట్టూ పనికిరాని మొక్కలు అల్లుకోవడంతో ప్రమాదకరంగా మారింది. సమస్యపై గత నెల 30న ఈనాడులో 'పెరుగుతున్నా పట్టించుకోరా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించడంతో వారు నియంత్రిక వద్ద మొక్కలను తొలగించారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోండి

హిరమండలం, న్యూస్‌టుడే: అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని హిరమండలం సహాయ కార్మిక అధికారి వై. శైలేష్‌కుమార్ సోమవారం తెలిపారు. హిరమండలం, పాతపట్నం, కొత్తూరు, భామిని మండలాల వారు సందేహాలు ఉంటే హిరమండలంలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో కృష్ణమోహన్

జలుమూరు, న్యూస్‌టుడే: శైవ క్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వరస్వామిని పంచాయతీరాజ్ శాఖ సహాయ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు సాదరంగా స్వాగతం పలికి పేరు, గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను, స్వామి పురాణ గాథను వివరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి తమ్మన్నగారి సతీష్‌కుమార్, ఆలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వంతెన నిర్వహణ ఇంతేనా



కొత్తూరు మండలంలోని కిమిడి- వారణాసి (కేవీ) రహదారిలో బలద సమీపంలో గెడ్డ పైనున్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 30 ఏళ్ల క్రితం దీనిని నిర్మించారు. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల మధ్య నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో తిరుగుతుంటాయి. వంతెన నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో పనికిరాని మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా మారింది. యంత్రాంగం స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ డీఈ సాగర్ వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, కొత్తూరు

రెండు నెలలుగా నిరుపయోగం

పోలాకి ఎంఆర్సీ వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో తాగునీటి మోటారు రెండు నెలలుగా పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు, సిబ్బంది బయట నుంచి నీరు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని హెచ్‌ఎం ఎస్.లక్ష్మీకుమారి పేర్కొన్నారు. అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు హేమసుందరరావు కోరుతున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని పంచాయతీ కార్యదర్శి ఈశ్వరమ్మ చెప్పారు. – న్యూస్‌టుడే, పోలాకి



కాస్త చూసి నడవండి..!



సారవకోట మండలం అవలంగిలోని బూసిన వీధి సీసీ రోడ్డు మధ్య గొయ్యి ప్రమాదకరంగా మారింది. రహదారి కుంగి పోవడంతో సమస్య ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. పనుల్లో నాణ్యతా లోపం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు. రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి బి.హిమబిందు వద్ద ప్రస్తావించగా సర్పంచి దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేపడతామని చెప్పారు.
– న్యూస్‌టుడే, సారవకోట

ఒంటరిగా వెళ్లాలంటే భయం

జలుమూరు మండలం చల్లవానిపేట కూడలిలో శునకాలు ప్రయాణికులను హడలెత్తిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో గుంపులుగా సంచరిస్తూ దాడి చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. కుక్కలు వాహనాల వెంట పడుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు వద్ద ప్రస్తావించగా పశువైద్యులతో చర్చించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, జలుమూరు



నిర్లక్ష్యానికి నిదర్శనం..!



చిత్రంలో రూపురేఖలు కోల్పోయి పచ్చదనంతో కనిపిస్తున్నది కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో వెయ్యి ఎకరాలకు పైగా సాగునీరందించే మంగళిగెడ్డ. కోటబొమ్మాళి పెద్దచెరువు పక్కన ఉన్న దీని నుంచి వరదనీరు పోతుంది. స్థానికులు ఇందులో వ్యర్థాలు వేస్తుండటంతో అధ్వానంగా మారింది. అధికారులు స్పందించి, గెడ్డను బాగు చేయకుంటే కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల రైతులకు సాగునీటికి ఇబ్బందులు తప్పవని పలువురు వాపోతున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామని నీటిపారుదలశాఖ ఏఈ లోకేశ్ స్పష్టంచేశారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

దీన బాంధవి.. దేవీ శాంభవి

టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మండపాల్లో సోమవారం భక్తులు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు నిర్వహించారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే బృందం


నరసన్నపేటలో భక్తుల కుంకుమ పూజలు


శ్రీముఖలింగంలో పూజలందుకుంటున్న వారాహి అమ్మవారు


కోటబొమ్మాళి: కురుడు పంచాయతీ పాకివలసలో శాకంబరీ దేవిగా..


నందిగాం మండలం నర్సిపురంలో..

మిల్లర్ల సంఘ అధ్యక్షుడిగా లక్ష్మణరావు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి మిల్లర్ల సంఘ అధ్యక్షుడిగా సకలాభక్తుల లక్ష్మణరావు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా డోకి మణికంఠ, కోశాధికారిగా కోరాడ చిన్నగోవిందరావు బాధ్యతలు స్వీకరించారు. నూతన కార్యవర్గాన్ని నిమ్మాడలో జిల్లా రైసు మిల్లర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్ ఘనంగా సత్కరించారు. మిల్లర్లు వెంకప్ప, నరసింహ, రామ్‌కుమార్, గణపతి, రమణమూర్తి పాల్గొన్నారు.


లక్ష్మణరావును సత్కరిస్తున్న జిల్లా మిల్లర్ల సంఘ గౌరవ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్

వామ్మో..నాగుపాము

సారవకోటలోని ఆదినారాయణ ఇంటి ఆవరణలో ఆదివారం సాయంత్రం నాగుపాము భయాందోళనకు గురిచేసింది. అరుగుపైన బుసలు కొట్టడంతో చోడసముద్రం గ్రామంలో పాములు పట్టే వారికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని సర్పాన్ని పట్టుకుని దూరంగా విడిచిపెట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.
– న్యూస్‌టుడే, సారవకోట



కలమటని కలిసిన వజ్జ బాబూరావు

మాతల గ్రామంలో తెదేపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కలమట వెంకటరమణను ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలమటను వజ్జ బాబూరావు సత్కరించారు. అనంతరం జిల్లాలో పార్టీ పరిస్థితిపై ఇద్దరూ చర్చించారు.
– న్యూస్‌టుడే, కొత్తూరు



రేపు మండల సర్వసభ్య సమావేశం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : టెక్కలి మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి తెలిపారు. ఉదయం 10:30 గంటలకు జరగనున్న సమావేశానికి సభ్యులతో పాటు మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

నిబంధనలు మీరితే చర్యలు

కొత్తూరు, న్యూస్‌టుడే: వాహన చోదకులు నిబంధనలు మీరితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు అన్నారు. కొత్తూరులో సోమవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతి పత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు.

అవీ..ఇవీ..అన్నీ

ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించండి

హిరమండలం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. సోమవారం గొట్ట, గొట్ట లక్ష్మీపురం గ్రామాల మధ్య గొట్టపోలమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం శ్రీరామేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

హిరమండలం, న్యూస్‌టుడే: తుంగతంపకాలనీ, చొర్లంగి గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని జనసేన నాయకుడు పడాల కార్తీక్ కోరారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలో కలెక్టర్ స్వప్నలి దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మోహనలక్ష్మీ, ఉదయ్‌శంకర్, గురుప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాదర్బారును విజయవంతం చేయండి

మెళియాపుట్టి: మెళియాపుట్టి రెవెన్యూ కార్యాలయంలో ఎమ్మెల్యే గోవిందరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించే ప్రజాదర్బారును విజయవంతం చేయాలని ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఎమ్మెల్యే వినతులు స్వీకరిస్తారని చెప్పారు. తహసీల్దారు బి.పాపారావు ఏర్పాట్లను పరిశీలించారు.

సత్యసాయి పర్తియాత్ర

ఎల్ఎన్‌పేట: పర్తియాత్ర సందర్భంగా శ్యామలాపురంలో సత్యసాయి పాదుకలను భక్తులు మందిరానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఏపీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు, జోనల్ ఇన్‌ఛార్జి చంటి మాస్టర్ పాదుకలను గ్రామ సత్యసాయి సేవా సమితి సభ్యులకు అందజేశారు.



చెల్లుబాటులోనే రూ.10ల నాణేలు

సారవకోట, న్యూస్‌టుడే: రూ.10లు నాణేలు చెల్లుబాటులోనే ఉన్నాయని సారవకోట ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ ఇప్పిలి భానోజీరావు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో సిబ్బందితో సోమవారం ప్రచారం నిర్వహించారు. అనంతరం మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీడీవో మోహన్‌కుమార్ తదితరులను కలిసి కరపత్రాలు అందించారు.

పట్టాలు ఇచ్చారు.. 1బీలు మరిచారు..!


నిరసన తెలుపుతున్న గిరిజనులు (పాతచిత్రం)

న్యూస్‌టుడే, నందిగాం

నందిగాం మండలం రధజనబొడ్డపాడు పంచాయతీ భైరిబొడ్డపాడు గ్రామానికి చెందిన 56 మంది గిరిజనులకు వైకాపా ప్రభుత్వం హయాంలో రెవెన్యూ అధికారులు కొండ పోరంబోకు భూములకు పట్టాలు మంజూరు చేశారు. అందులో 11 మందికి 1బీలు రావడం లేదు. సమస్యను వీఆర్వోకు తెలపగా సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని త్వరలో వచ్చేలా చూస్తామని, 5 నెలలుగా కాలయాపన చేస్తున్నారని వారంతా ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రుణాలు రాక ఇబ్బందులు

1బీలు రాకపోవడంతో ఖరీఫ్ సీజనులో బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే.. రబీలో జొన్న, కొర్రలు, రాగులు తదితర అపరాల పంటలు వేసుకోవడానికి రుణాలు సైతం పొందలేమని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 1బీలు కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరుగుతున్నా ప్రయోజనం లేదని వారు పేర్కొంటున్నారు.

ప్రయోజనం సున్నా..



రుణాలు రాకపోవడంతో పట్టాలు ఇచ్చి ప్రయోజనం లేకుండా పోయింది. ఆయా స్థలాలు చదును చేసుకోవడానికి, అపరాలు పండించు కోవడానికి డబ్బులు అవసరం. ఆర్థిక ఇబ్బందులతో సాగుచేయలేని పరిస్థితి. – పి.లక్ష్మీకాంతం, భైరిబొడ్డపాడు

తక్షణమే మంజూరు చేయాలి



రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే 1బీలు వచ్చేలా చూడాలి. కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకుంటే మేలు జరుగుతుంది.– ఎస్.పద్మావతి, భైరిబొడ్డపాడు

లోపాలు సరిదిద్దుతాం

సాంకేతిక సమస్యలతో కొందరికి 1బీలు రాలేదు. వాటిని పరిశీలించి లోపాలు సరిదిద్దుతాం. దీనిపై ఆర్ఐ, వీఆర్వోలను వివరణ అడిగి, ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు కృషి చేస్తాం. – భాగ్యలక్ష్మి, తహసీల్దారు, నందిగాం

మెట్‌కోర్ కార్మికులకు న్యాయం చేయాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రావివలసలోని మెట్‌కోర్ ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ కార్మికులకు న్యాయం చేయాలని సీపీఎం నేతలు, కార్మికులు కోరారు. సోమవారం టెక్కలిలో సహాయ కార్మిక కమిషనరు రాధాకుమారికి సీఐటీయూ నేతల సమక్షంలో సమస్యలు వివరించారు. 2023, మే నుంచి తమకు జీతాలు చెల్లించకుండా సంస్థ దివాలా తీసినట్లు చూపించి కార్మికులను మోసం చేశారన్నారు. పరిశ్రమ యాజమాన్యం మారిన సమయంలో కొద్దినెలలు నడిపి మళ్లీ మూసేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మొత్తం వ్యవహారంపై బహిరంగ విచారణ జరపాలని కలెక్టర్‌ను కార్మికులు కోరడంతో ఆయన ఆదేశాల మేరకు వారితో సహాయ లేబర్ కమిషనరు మాట్లాడారు. కార్మిక సంఘ నేతలు పిట్ట గంగయ్య, పీఎండీ బోస్, కొంకి భుజంగరావు, పి.సీతారాం, సీఐటీయూ నాయకుడు నంబూరు షణ్ముఖరావు పాల్గొన్నారు.


సహాయ కార్మిక కమిషనరు రాధాకుమారికి సమస్యలు వివరిస్తున్న కార్మికులు, సీపీఎం నేతలు

తెరపై ఈనాడు

★ కీర్తన: రామ్‌నగర్ బన్నీ ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: దేవర ★ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): దక్షిణ ★ సూర్యమహల్: శ్వాగ్ ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: మత్తు వదలరా-2 ★ మారుతి: చిట్టి పొట్టి

– న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

• శ్రీకాకుళం • ఆమదాలవలస • ఎచ్చెర్ల

కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో నియామకాలకు దరఖాస్తు చేసుకోండి

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది నియామకానికి పొరుగు సేవల కింద ఏడాది కాలానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈవో తిరుమలచైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. ● కేజీబీవీల్లో సహాయ కుక్ 9, డే, నైట్ వాచ్‌మెన్ 4, స్కావెంజర్ 3, స్వీపర్ 4 ● ఆదర్శ పాఠశాలల్లో చౌకీదారు 6 హెడ్ కుక్ 4, సహాయ కుక్ 6 మొత్తంగా 36 పోస్టులకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15 లోగా దరఖాస్తులను ఎంఈవో కార్యాలయాల్లో పని వేళల్లో సమర్పించాలని కోరారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం


శ్రీకాకుళంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), గార, సరుబుజ్జిలి, పొందూరు, జి.సిగడాం,న్యూస్‌టుడే: పంచాయతీల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు అవసరమని.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో శైలజ తదితరులు పాల్గొన్నారు. ❖ గార ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురాం, జడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాత మాట్లాడారు. ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, ఇన్‌ఛార్జి ఈవో రాము, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ❖ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు అందరూ కలిసికట్టుగా పని చేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో ఎం.పావని అన్నారు. వంద రోజుల అభివృద్ధి ప్రణాళికపై మండల పరిషత్తు, వెలుగు కార్యాలయాల్లో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ❖ పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీపీ కిల్లి ఉషారాణి అన్నారు. పొందూరు మండల పరిషత్తు కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో మన్మథరావు తదితరులు పాల్గొన్నారు. ❖ ప్రణాళికాబద్ధంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

అక్రమంగా తరలిస్తున్న 150 గోవుల స్వాధీనం

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ సమీపంలోని ఇబ్రహీంపట్నానికి అక్రమంగా తరలిస్తున్న 150 గోవులను గంపలగూడెం పోలీసులు ఆదివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులు వరుసగా రెండో రోజు కూడా వాహనాల తనిఖీ ద్వారా గోవుల అక్రమ రవాణాకు చెక్ పెట్టారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను వద్ద శనివారం అర్ధరాత్రి లారీల్లో తరలిస్తున్న 50 ఆవులను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. వాటిని భద్రత కోసం ప్రస్తుతం నెమలి వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉంచారు. తాజాగా ఆదివారం రాత్రి మరో మూడు లారీల్లో అక్రమంగా తరలిస్తున్న 150 ఆవులను నెమలి గ్రామం వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎస్.శ్రీను తెలిపిన వివరాల మేరకు నెమలిలో ఆదివారం రాత్రి గ్రామస్థులు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తుండగా వరుసగా మూడు లారీలు రావడంతో అనుమానంతో ఆపి విచారించారు. వాటిలో గోవులు ఉండడం గమనించి వెంటనే గంపలగూడెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్సై శ్రీను తన సిబ్బందితో అక్కడికి వెళ్లి ఆవులు, 3 లారీలను స్వాధీనం చేసుకున్నారు.

శిలాఫలకాలకే పరిమితం.. రహదారి నిర్మాణం..!

–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

ఆమదాలవలస మండలం కట్యాచార్యులపేట పంచాయతీ హనుమంతుపురం వైపు వెళ్లేందుకు సరైన రహదారి లేక వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి లేకపోవడంతో 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కూన రవి కుమార్ స్పందించి రూ.1.28 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టేందుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గుత్తేదారు పనులు ప్రారంభించి కొంతవరకు చేశారు. 2019లో ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అప్పుడు అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం 25 శాతం పనులు చేసిన వాటిని రద్దు చేసి రీటెండరింగ్ పిలిచారు. దీంతో రూ.70 లక్షలతో రహదారి నిర్మాణం చేపట్టేందుకు గుత్తేదారు ముందుకు రాగా అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కానీ గత ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టలేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.


హనుమంతుపురం వెళ్లే మార్గం ఇలా..

వర్షం పడితే నడకా కష్టమే..: హనుమంతుపురానికి వెళ్లేందుకు మట్టి దారే మార్గంగా ఉండటంతో వర్షం పడితే దీనిపైన నడకా కష్టంగా ఉంటుందని ఆ మార్గంలో ప్రయాణించేవారు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా రహదారి నిర్మాణం జరగకపోవడంతో నరకం చూస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మట్టి మార్గంలో పెద్ద గోతులు ఏర్పడటంతో 108, 104, ఇతర వాహనాలు రావాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు

ఆమదాలవలస మండలం హనుమంతుపురానికి రహదారి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో కొంత వరకు నిర్మాణం చేపట్టాం. తరువాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. ఈ రహదారి విషయమై కూటమి ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. నిధులు మంజూరైన వెంటనే రహదారి నిర్మాణం చేపడతాం.

–సత్యనారాయణ, ఏఈ, పంచాయతీ రాజ్ శాఖ, ఆమదాలవలస

రహదారుల నిర్మాణానికి రూ. 32.43 కోట్లు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస నియోజకవర్గంలో ఉన్న ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లో సీసీ రహదారుల ఏర్పాటుకు రూ.32.43 కోట్ల నిధుల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవలే కాలువలు నిర్మాణం కోసం రూ.7.56 కోట్ల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గానికి మహర్దశ పట్టనుందని, నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. నిధులు విడుదల చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కుక్కకాటుతో ఇద్దరికి గాయాలు

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జ మండలంలోని తుడ్డలి, డొంకలపర్తల్లో సోమవారం సాయంత్రం వీధి కుక్క ఇద్దరిపై దాడి చేసింది. తుడ్డలికి చెందిన కాద పోలమ్మ గ్రామానికి సమీపంలో పశువులను మేపుతుండగా అకస్మాత్తుగా ఆమెపై దాడి చేసి చేతిపైన, భుజం, మోచేతి భాగాల్లో కరిచి గాయపరిచింది. కుటుంబ సభ్యులు ఆమెను పాలకొండ ఏరియా ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. డొంకలపర్తకు చెందిన జె.దాలినాయుడును కరవడంతో బలమైన గాయాలయ్యాయి. అతడిని కూడా పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

అవస్థ చూడండి.. సాయం చేయండి!

'మీ కోసం'లో కలెక్టర్‌కు వినతి


చీపురు హరి భాస్కరదేవ్

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే కలెక్టరేట్: శ్రీకాకుళం నగరం కొన్నా వీధికి చెందిన చీపురు హరి భాస్కరదేవ్ కూలి పని చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లల్ని పోషించేవారు. కరోనా వ్యాప్తి సమయంలో పక్షవాతం రావడంతో నడవలేని స్థితికి వచ్చారు. అప్పట్లో పింఛను కోసం ప్రయత్నించినా రాలేదు. నడవడానికి ఇబ్బందిగా ఉంది. మూడు చక్రాల వాహనం.. పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఈమేరకు జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమంలో అర్జీ అందజేశారు.

సాగునీరు అందించరూ..

నారాయణపురం ప్రాజెక్టు ద్వారా ఎచ్చెర్ల మండలంలోని సుమారు 13 పంచాయతీలకు 10 వేల ఎకరాలకు సాగునీరందక నష్టపోతున్నామని రైతులు రామారావు, సూర్యనారాయణ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా తమ ప్రాంతానికి సాగునీరు రాలేదని.. ఇప్పటికైనా నారాయణపురం కుడి కాలువను ఆధునికీకరించి నీరందేలా చూడాలని కోరారు.

దహన సంస్కారాలకు కలప వితరణ



ఆమదాలవలస మండలం లొద్దలపేట గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలకు కర్రలు లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది తెలుసుకున్న గ్రామానికి చెందిన బగాతి రామారావు అనే రైతు తన తోటలో ఉన్న సుమారు రూ.50 వేల విలువ చేసే కలపను కొట్టించి శ్మశానవాటిక వద్ద నిల్వ చేశారు. గ్రామంలో ఎవరు మృతి చెందినా ఆ కర్రలతో దహన సంస్కారాలు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇవి అయిపోతే మళ్లీ తెచ్చి వేస్తామని ఆయన చెప్పడంతో గ్రామస్థులు ఆయనను అభినందించారు. –న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

అమ్మో.. గొయ్యి..!

సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస గ్రామంలో ప్రాథమిక పాఠశాల వెనుక భాగంలో గొయ్యి ప్రమాదకరంగా ఉంది. తాగునీటి ట్యాంకు కోసం తీసిన దీన్ని అర్ధాంతరంగా ఇలా విడిచిపెట్టడంతో వృథాగా ఉంది. ట్యాంకు నిర్మించకపోతే ఎలాంటి ప్రమాదం జరకముందే గొయ్యిని పూడ్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దుర్గేష వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, సరుబుజ్జిలి




విజేతలతో క్రీడా ప్రతినిధులు, శిక్షకులు

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో విజయకేతనం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజయకేతనం ఎగురవేశారు. విశాఖపట్నం జిల్లా నునపర్తిలో మూడు రోజులుగా జూనియర్ రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. జిల్లా బాలుర జట్టు ద్వితీయ స్థానం, బాలికల జట్టు తృతీయ స్థానం సాధించాయని జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోత పూర్ణచంద్రరావు, పీవీజీ కృష్ణంరాజు తెలిపారు. జూనియర్ విభాగంలో బాలుర జట్టు తొలిసారి సెమీస్ దాటి ఫైనల్స్‌లో అడుగు పెట్టిందని చెప్పారు. విజేతలను అసోసియేషన్ ఛైర్మన్ సూర శ్రీనివాసరావు, ప్రతినిధులు పి.అజయ్‌కుమార్, ఎల్వీ రమణ, తదితరులు అభినందించారు.

అవీ..ఇవీ..అన్నీ

సీసీఎస్ ఎస్సైగా కృష్ణప్రసాద్



శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఎస్సైగా కృష్ణప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సాయిబాబా మందిరంలో కుంకుమార్చన

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలసలోని మెట్టక్కివలస సత్యసాయి బాబా మందిరంలో సోమవారం సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి మహిళా సమన్వయకర్త ఆకెళ్ల రామలక్ష్మి ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవికి కుంకుమ పూజలు చేసినట్లు భక్తులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని అరిణాంఅక్కివలస పంచాయతీ పట్టుశాలిపేట గ్రామానికి చెందిన వేకువోలు తవుడు తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని సోమవారం ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 4న రాత్రి తన ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనం అయిదో తేదీ ఉదయం చూసేసరికి కనిపించలేదని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వివాహిత అదృశ్యం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి ఈ నెల 5వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె భర్త సోమవారం ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దసరా సెలవులు కావడంతో కన్నవారి ఇంటికి వెళ్తానని చెప్పి ఇంటి వద్ద నుంచి ఆటోలో వెళ్లి రెండు రోజులవుతున్నా రాకపోగా ఎక్కడా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఉద్యోగాలకు ఎంపిక

పొందూరు, న్యూస్‌టుడే: మండలంలోని తోలాపి గ్రామానికి చెందిన దుంపల శ్రీనివాసరావు, సుశీల దంపతుల కుమార్తె దుంపల అపర్ణ నేషనల్ లా యూనివర్సిటీలో రిసెర్చ్ అసిస్టెంట్ ఆఫ్ లా, దామోదర సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీలో అసోసియేట్ అధ్యాపకురాలిగా ఎంపికయ్యారు. బీసీ 'ఎ' కేటగిరీలో ఒకే ఒక్క పోస్టు ఉండగా అపర్ణ దక్కించుకోవడం హర్షణీయమని గ్రామస్థులు పలువురు ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

సమస్యలు పరిష్కరించరూ..

బలగ(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహార పంపిణీ వివరాల నమోదుకు సంబంధించి వివిధ రకాలు యాప్‌లు ఉన్నాయని.. అవన్నీ ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సంఘ సభ్యులు కల్యాణి, పద్మలత తదితరులు కోరారు. ఈమేరకు ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీకి వినతిపత్రం అందజేశామని తెలిపారు.


నవనంబాడు వాసుల శ్రమదానం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం పొన్నాం పంచాయతీ నవనంబాడులోని ఉపకేంద్రం చుట్టూ ఉన్న పనికి రాని మొక్కల్ని గ్రామస్థులు తొలగించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ సూచనల మేరకు శ్రమదానం చేశారు. ఉప సర్పంచి వీవీ ప్రకాష్, ఎస్.వెంకటరావు, సింహాచలం, అచ్చిబాబు, నర్సింహులు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ప్రజలతో ముడిపడి ఉన్న పారిశుద్ధ్య వ్యవస్థపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం అధికారులతో సమీక్షించారు. కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస వాసి నృత్య ప్రతిభ



ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఆమదాలవలసకు చెందిన కూన శ్రీలత కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకొని జిల్లా కీర్తిని రాష్ట్రం నలుమూలలా ఇనుమడింపజేస్తున్నట్లు కూచిపూడి విశ్వవిద్యాలయం నాట్యాచార్యులు డా.ఏలేశ్వరపు శ్రీనివాసులు అన్నారు. సోమవారం ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి దేవాలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా శ్రీలత ఆదియోగి సాంస్కృతిక నృత్య రూపకాన్ని ప్రదర్శించి పలువురిని ఆకట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరుస్తూ నృత్యంలో రాణిస్తున్నట్లు తెలిపారు.

18 నుంచి నాటిక పోటీలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు సుమిత్ర కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకర శర్మ, సూత్రా ఫౌండేషన్ అధ్యక్షుడు నిక్కు హరి సత్యనారాయణ తెలిపారు. అంతర్ముఖం, పులి కాలం, కొండగాలి, మార్పు, కెరటాలు, ది డెత్ ఆఫ్ ఏ మాన్ హీటర్, సప్తమసూత్రం నాటికలు ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ నెల 20న విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.


మహిళకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరులోని సత్యసాయి సేవా సమితి మందిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నిర్వాహకుల సౌజన్యంతో సోమవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి 85 మంది పాల్గొన్నారు. వీరికి పరీక్షలు నిర్వహించి 30 మందిని ఉచిత కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్యాధికారులు శ్రీవిన్య, అప్పలరాజు, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దున్నా రాధాకృష్ణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా..

ఇబ్బంది పెడుతున్నారు

న్యూస్‌టుడే, కావలి: 'పరీక్షలకు ముందు హాల్‌టికెట్ల జారీలో జాప్యంపై ఆందోళన చేశామని కళాశాల యాజమాన్యం మాపై కక్ష కట్టింది. ఇంటర్నల్ మార్కులు తగ్గించారు. ఇప్పుడు కోర్సు పూర్తయినా, ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వస్తున్నా.. చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన తామంతా.. కొద్దిరోజులుగా కళాశాల యాజమాన్యం, అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. నర్సింగ్ శిక్షణ ధ్రువీకరణ పత్రాలు సహా.. ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు కూడా వారి వద్దనే ఉన్నాయి. మీరైనా తగిన చర్యలు తీసుకోండి' అంటూ శ్రీకాకుళం, తుని తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు వాపోయారు. కావలి పట్టణంలోని ఓ నర్సింగ్ కళాశాలలో చదివిన వీరంతా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో వంశీకృష్ణకు మొరపెట్టుకున్నారు. దాంతో ఆయన తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజితను ఆదేశించగా.. ఆమె కళాశాల నిర్వాహకులతో చర్చిస్తున్నారు. ఇక్కడ చదువుకున్న యువతులకు తప్పక న్యాయం చేస్తామని, వారి ధ్రువీకరణ పత్రాలు తిరిగి వారి చేతికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హర్షవల్లి లయన్స్ క్లబ్‌కు పురస్కారాలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: హర్షవల్లి లయన్స్ క్లబ్ సేవలకు ఏడు పురస్కారాలు వరించాయి. విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో క్లబ్ వ్యవస్థాపకుడు హారికాప్రసాద్, కరణం శోభారాణి బృందానికి లయన్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ గోపాలరావు పురస్కారాలు అందజేసి అభినందించారు. పురస్కారాలు అందుకున్న వారిలో వావిలాపల్లి జగన్నాథంనాయుడు, డా.చింతాడ కృష్ణమోహన్, తర్లాడ అప్పలనాయుడు తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి నివేదిక తయారుచేయండి


ఇంద్రపుష్కరిణి పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

శ్రీకాకుళం నగరం, గార,న్యూస్‌టుడే: ఆదిత్యాలయ అభివృద్ధిపై మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో నిర్వహించనున్న సమావేశం నాటికి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఈవో వై.భద్రాజీని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశించారు. అరసవల్లిలో సూర్యనారాయణస్వామిని సోమవారం తెదేపా నాయకులతో కలిసి ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం ఇంద్రపుష్కరిణి, మాడ వీధులు, క్యూలైన్లను పరిశీలించారు. ❖ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం కొమరవానిపేట గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు.

నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలి


మాట్లాడుతున్న తెదేపా నాయకుడు తమ్మినేని విద్యాసాగర్

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో మద్యం, ఇసుక మాఫియాలను నడిపించింది వైకాపా నాయకులేనని తెదేపా రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. సోమవారం ఆమదాలవలసలోని తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యంపై విధివిధానాలతో ప్రతి చోటా నాణ్యమైన మద్యం చౌక ధరలకు అందించే లక్ష్యంతో ఈ నెల 11న లాటరీపై దుకాణాలు అందించేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. కొందరు స్థానిక వైకాపా నాయకులు ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇసుక, మద్యం మాఫియా నడుపుతున్నట్లు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఇటువంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కొండబాబు, తంగి గుర్రయ్య, జి.డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ జట్టు ఖరారు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: గుంటూరులో ఈ నెల 10 నుంచి నిర్వహించనున్న అండర్-14 బాలుర తుది జట్టును ఖరారు చేశామని క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హాసన్‌రజా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జట్టు కోచ్ మేనేజర్లుగా శ్రీనివాస్, కొట్టిస కిరణ్ వ్యవహరిస్తారని మెంటార్ ఇలియాజ్ అహ్మద్ చెప్పారు.

జట్టు సభ్యులు వీరే...

ఎస్.వివేకానంద (కెప్టెన్), ఎ.నేత్రాకిరణ్, వి.కృష్ణకుశాల్, ఎన్.జోగేంద్ర, ఎం.పవన్‌కుమార్, ఎస్.వెంకట్ ప్రేరణ్, జె.హర్షవర్ధన్, శ్రీయోజిత్, ఎస్.రుత్విక్, జీఎస్‌వీ సూర్య, కోండ్రు జోషిత్, షరీఫ్ హాక్, సాయి ఆదిత్య, కె.గౌతమ్, టి.జోష్మిత, పి.మోక్షిత్ శ్రీనిత్విక్ ❖ స్టాండ్ బైగా ఆర్.షాయిల్‌కుమార్, పి.మోహర్‌తేజ, ఎంఎస్‌జాన్‌వెస్లీ, మనోజ్‌శ్రీసాయి ఎంపికయ్యారు.

శిశు సంరక్షణే ధ్యేయం


ఎంఎన్‌సీయూ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ షకీలా

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శిశువులను ఆరోగ్యంగా ఉంచడమే తమ ధ్యేయమని ప్రభుత్వ సర్వజనాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి షకీలా అన్నారు. ఆసుపత్రి చిన్న పిల్లల విభాగంలో సోమవారం మాతా నియోనాటల్ కేర్ యూనిట్‌ను (ఎంఎన్‌సీయూ) ప్రారంభించారు. గర్భస్థ, బరువు తక్కువ శిశువులను కాపాడటమే ఈ విభాగం లక్ష్యమని తెలిపారు. పలు విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) ఈ నెల 3వ తేదీ నుంచి జిల్లాలో మూడు కేంద్రాల్లో ప్రారంభం కాగా సోమవారం కూడా కొనసాగాయి. మండలం కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో రెండు షిఫ్టుల్లో 200 మందికి 184 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 51 వినతులు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 51 వినతులు వచ్చాయి. ఎస్పీ మహేశ్వరరెడ్డి వాటిని అందుకుని బాధితులతో మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై రణస్థలం మండలం దన్నానపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం గోవిందపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. జేఆర్‌పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. రణస్థలంలో పని ముగించుకొని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో అటుగా వచ్చిన స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సంఘటనను చూసి గాయపడిన వారిని విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి పంపించి అవసరమైన సాయాన్ని అందించారు. జేఆర్‌పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో ఒకరికి..

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని పొన్నాడ బ్రిడ్జి రోడ్డు నుంచి పొన్నాడ గ్రామం వైపు వెళ్తున్న రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పాకల శ్యామలరావు గాయాలపాలయ్యాడు. ఎచ్చెర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . శ్యామలరావు ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నుంచి పొన్నాడ వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన అతడిని వెంటనే చికిత్స కోసం శ్రీకాకుళంలోని సర్వజనాసుపత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతున్నాడు.